క్లుప్తంగా

మైపర్‌లో ఘనంగా జార్జి జయంతి



జార్జి విగ్రహానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ ఆదిమూలపు సతీష్, కుటుంబ సభ్యులు

కర్నూలు (సిటీ): నగరంలోని జొహరాపురం రోడ్డులో ఉన్న మైపర్ కాలేజీలో జార్జి విద్యాసంస్థల వ్యవస్థాపకులు జార్జి జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కుమారుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్, మైపర్ విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ స్టెల్లా సతీష్ పాల్గొని జార్జి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జార్జి విద్యాసంస్థలను ఏర్పాటు చేసి ఎంతో మందికి విద్యను అందించారన్నారు. కార్యక్రమంలో మైపర్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ జె.రవికుమార్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కాసర్ల సురేష్, ఎస్‌ఆర్‌సీ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రకాష్, కాలేజీ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు హనుమాన్ జయంతి

కర్నూలు కల్చరల్: నగరంలోని పలు ఆలయాల్లో శనివారం హనుమత్ జయంతి వేడుకలు నిర్వహించనున్నారు. స్వామివారికి అభిషేకాలు, ఆకు పూజ, వడమాల నివేదన, హోమాలు చేయనున్నారు. శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవ సమితి ఆధ్వర్యంలో జిల్లా గోరక్షణ శాలలో వేడుకలకు ఏర్పాట్లు చేశారు.

ప్రధాని మోదీ వ్యాఖ్యలు అర్థరహితం

కర్నూలు(సెంట్రల్): ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఆదివారం సెలవు దినాన్ని మార్చే ఆలోచనలో ఉన్నామని పేర్కొనడం అర్థరహితంగా ఉందని డీసీసీ కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ అనంతరత్నం మాదిగ, ఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బి.బతుకన్న , ఎస్సీ సెల్ చైర్మన్ లాజరస్ అన్నారు.శుక్రవారం డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇటీవల మోదీ ఝార్ఖండ్ వెళ్లిన సమయంలో ఆదివారం సెలవు దినాన్ని శుక్రవారానికి మార్చాలని చూస్తున్నామని చెప్పడం ఎంత అవివేకమన్నారు. మరోసారి కులాలు, ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టి గెలవాలని చూస్తున్నారని, ఆయన మాటలను ఖండిస్తున్నట్లు చెప్పారు.

నేడు పౌరాణిక నాటకాల ప్రదర్శన

కర్నూలు కల్చరల్: ప్రముఖ రంగ స్థల కళాకారుడు కళా ప్రియ తిరుపాలు జన్మదినం సందర్భంగా శనివారం సాయంత్రం 7 గంటలకు మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో పౌరాణిక నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు కళావాహిని సాంస్కృతిక సాహితీ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మనోహర్‌బాబు తెలిపారు. నారద ఏకపాత్ర, శ్రీకృష్ణ తులాభారంలోని పలు సన్నివేశాల ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

రేపు డీటీఎఫ్ సమావేశం

కర్నూలు సిటీ: డీటీఎఫ్ జిల్లా వార్షిక కౌన్సిల్ సమావేశం రేపు (ఆదివారం)ప్రభుత్వ ఉన్నత పాఠశాల(టౌన్ మోడల్ హైస్కూల్)లో జరుగనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోట్ల చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షుడు కర్రె క్రిష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎన్నికల విధులకు హాజరకాలేదని ఉద్యోగ, ఉపాధ్యాయులను సస్పెండ్ చేశారని, తక్షణమే అధికారులు స్పందించి సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు. జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహించిన పీఓ, ఏపీఎం, ఓపీఓలకు ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు డ్యూటీ సర్టిఫికెట్స్ ఇవ్వాలని కోరారు.

నేడు ఏపీజీబీ ఆవిర్భావ వేడుకలు

కర్నూలు(అగ్రికల్చర్): ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు 19వ వ్యవస్థాపక దినోత్సవాన్ని నేడు పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు రీజినల్ మేనేజర్ పీఎస్ నవీన్‌కుమార్ తెలిపారు. వాణిజ్య బ్యాంకులకు దీటుగా ఏపీజీబీ కూడా ఖాతాదారులకు అన్ని రకాల సేవలు అందిస్తోందని ఆయన శుక్రవారం విలేకర్లకు తెలిపారు. రైతులు, మహిళలతో పాటు అన్ని వర్గాల వారికి ఏపీజీబీ రుణాలు ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీలో పెద్ద ఎత్తున రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రూ.కోటి వరకు రుణాలు కూడా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

డీడీఓపీ అహేజ్ కైల్ పదవీ విరమణ



కర్నూలు(లీగల్) : డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌గా విధులు నిర్వహిస్తున్న డీడీఓపీ అహేజ్ కైల్ శుక్రవారం పదవీ విరమణ పొందారు. ఈయన స్థానంలో లక్ష్మీనారాయణ బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు పదవీవిరమణ చేసిన అహేజ్ కైల్ సేవలను కొనియాడి ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జాయింట్ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ అజయ్ ల్యామ్, కర్నూలు రేంజ్ డీఐజీ విజయరావు, పీపీలు, న్యాయవాదులు పాల్గొన్నారు.

కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- 4వ తేదీ ఉదయం 8 గంటల నుంచే ఓట్ల లెక్కింపు ప్రారంభం
- పాణ్యం ఎన్నికలకు సంబంధించి 14 టేబుళ్లలో 26 రౌండ్లలో ఫలితాల ప్రకటన
- మాక్‌పోల్, 17సీ, డిస్‌ప్లే కాని కంట్రోల్ యూనిట్ల పోలింగ్ కేంద్రాల వీవీ ప్యాట్లను లెక్కిస్తాం
- పాణ్యం నియోజకవర్గ ఆర్వో/జేసీ నారపురెడ్డి మౌర్య వెల్లడి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): పాణ్యం అసెంబ్లీ, అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని నంద్యాల ఎంపీ స్థానం ఫలితాల ప్రకటన కోసం రాయలసీమ యూనివర్సిటీలో పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ఆ నియోజకవర్గ ఆర్వో/జేసీ నారపురెడ్డి మౌర్య తెలిపారు. జూన్ 4వ తేదీన చేపట్టే కౌంటింగ్ కోసం దాదాపు 200 మంది సిబ్బందిని నియమించి ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. మొదట కల్లూరులో ఓట్ల లెక్కింపు ప్రారంభమై చివరిగా గడివేముల మండలం ఎస్.కొత్తూరు పోలింగ్ కేంద్రం ఓట్ల లెక్కింపు పూర్తి అవుతుందని ఆమె వెల్లడించారు. శుక్రవారం ఆమె కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. 4వ తేదీన ఉదయం 8 గంటల నుంచే కౌంటింగ్ ప్రారంభమవుతుందన్నారు. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్‌లను లెక్కిస్తామన్నారు. పాణ్యంలో దాదాపు 5,700 పోస్టల్ బ్యాలెట్లు ఉన్నాయని, వీటిని లెక్కించడం కోసం ప్రత్యేకంగా 5 టేబుళ్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నంద్యాల పార్లమెంట్‌కు సంబంధించిన పోస్టల్ బ్యాలెట్లను నంద్యాల జిల్లాకు పంపనున్నట్లు వివరించారు. ఇక 8.30 గంటల నుంచి ఈవీఎంల కౌంటింగ్‌ను చేపడతామని, ఇందుకోసం 14 టేబుళ్లను ఏర్పాటు చేసి 26 రౌండ్లలో ఫలితాలను ప్రటించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎక్కువ రౌండ్లు ఉండడంతో రాత్రి 9–10గ ంటల వరకు కౌంటింగ్ జరిగే అవకాశం ఉందన్నారు. ఇందుకోసం సిబ్బందికి షిఫ్టుల వారీగా విధులు కేటాయించినట్లు చెప్పారు. మొదటి రౌండ్‌కు 30 నిమిషాల సమయం, మిగతా రౌండ్లకు 20–25 నిమిషాల సమయం పట్టే అవకాశం ఉందన్నారు.

గెజిటెడ్ ఆఫీసర్ హోదా..సీలు లేకపోయినా పోస్టల్ బ్యాలెట్ చెల్లుబాటే

సవరించిన మార్గదర్శకాల ప్రకారం పోస్టల్ బ్యాలెట్‌లో గెజిటెడ్ ఆఫీసర్ సంతకం ఉంటే చాలని, సీలు, ఆయన హోదా లేకపోయినా ఆ బ్యాలెట్ చెల్లుబాటు అవుతుందని జేసీ నారపురెడ్డి మౌర్య వివరించారు. సంతకంపై నమ్మకం లేకపోతే అక్కడే ఉండే డిజిటల్ సైన్‌తో సరిపోల్చుకోవడానికి ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. అంతేకాక ఆ ఆఫీసర్‌కు సంబంధించి రిజిస్టర్‌లో పేరు ఉందో లేదో కూడా చూసుకోవడానికి అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. కాగా, ఏ పోస్టల్ బ్యాలెట్‌ను మొదట తిరస్కరించడం జరగదని, తక్కువ ఓట్లతో అభ్యర్థి గెలిస్తే మాత్రమే తిరస్కరణ ఓట్లపై దృష్టి సారిస్తామన్నారు. మరోవైపు మాక్ పోలింగ్ సరిగా జరగని పోలింగ్ కేంద్రాలు, 17సీ కింద నమోదైన పోలింగ్ కేంద్రాలు, కంట్రోల్ యూనిట్లు డిస్ ప్లే కాని పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఫలితాలను లెక్కించడం కోసం వాటి వీవీ ప్యాట్లను లెక్కిస్తామన్నారు.

కౌంటింగ్ ఏర్పాట్ల పరిశీలన



కౌంటింగ్ ఏర్పాట్లను అడిగి తెలుసుకుంటున్న రిటర్నింగ్ అధికారి భార్గవతేజ

కర్నూలు (టౌన్): 4వ తేదీ సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన కౌంటింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి భార్గవతేజ స్పష్టం చేశారు. శుక్రవారం నగర శివారులోని రాయలసీమ యూనివర్సిటీలో ఉన్న సైన్స్ బ్లాక్‌లో కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. అక్కడే కౌంటింగ్ సిబ్బందితో మాట్లాడారు. ఓట్ల లెక్కింపు రోజున తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలన్నారు. అనంతరం కర్నూలు అసెంబ్లీ, పార్లమెంటు ఈవీఎంలు భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్‌లను, అలాగే వాటికి వేసిన సీల్‌లను పరిశీలించి లాగ్‌బుక్‌లో సంతకం చేశారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ చల్లా కల్యాణి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మోహన్ కుమార్, నగరపాలక ఆరోగ్య శాఖ అధికారి విశ్వేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుందరేశ్వర స్వామి కల్యాణం



కల్యాణ మూర్తులకు పూజలు చేస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో శ్రీ లలితా సుందరేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శనివారం స్వామివార్ల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పండితులు మమిళ్ల పల్లి రాజేశ్ శర్మ ఆధ్వర్యంలో వేదోక్తంగా వేడుక జరిగింది. బుధవార పేట సూర్య కళా కల్చరల్ అకాడమీ సుధాకర్ ఆధ్వర్యంలో అన్నమాచార్య సంకీర్తనలు, లలితా రాఘవేంద్ర స్వామి సత్సంగ్ ఆధ్వర్యంలో కోలాటాలు, స్వామి అమ్మవార్ల దివ్యమంగళ రథోత్సవం కనుల పండువలా సాగాయి. లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి సందేశం ఇచ్చారు.

చదరంగంతో ఏకాగ్రత

కర్నూలు (టౌన్) : విద్యార్థినీ విద్యార్థులకు చదరంగం క్రీడ వల్ల ఏకాగ్రత, జ్ఞాపకశక్తి అలవడుతుందని ఈఎన్‌టీ సర్జన్ డాక్టర్ కిషోర్‌కుమార్ అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక ఎ.క్యాంప్ చాణిక్యపురి కాలనీలోని బద్రి చెస్ అకాడమిలో వేసవి చెస్ క్రీడా శిక్షణ శిబిరం ముగిసింది. ముగింపు సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు చెస్ పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు షీల్డ్‌లు, కప్‌లు అందజేశారు. అనంతరం చెస్ అకాడమి చీఫ్ కోచ్ బద్రి మాట్లాడుతూ చెస్ పోటీలను అండర్–7, అండర్–9 ఓపెన్ కేటగిరీల్లో నిర్వహించినట్లు చెప్పారు.

పొగాకు ఉత్పత్తుల వాడకంతో అనర్థం



డాక్టర్ రమేష్‌బాబును సన్మానిస్తున్న జి.పుల్లారెడ్డి దంత వైద్యకళాశాల యాజమాన్యం

కర్నూలు(హాస్పిటల్): ఆరోగ్యానికి హానికరమైన పొగాకు ఉత్పత్తులకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని ప్రముఖ సైకాలజిస్టు డాక్టర్ బి. రమేష్‌బాబు సూచించారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని శుక్రవారం నగర శివారులోని జి.పుల్లారెడ్డి దంత వైద్యకళాశాలలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రమేష్‌బాబు పొగాకు ఉత్పత్తులు వాడటం వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 5.4 బిలియన్ల మంది ప్రజలు పొగాకును వివిధ రూపాల్లో వాడుతూ దీనికి బానిసలవుతున్నారని తెలిపారు. వీరిలో 1.5 మిలియన్ల మంది వ్యక్తులు పొగాకు ప్రమాదాల కారణంగా ప్రతిరోజూ మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై. మురళీధర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో...

ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్, నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ, ఎస్వీ సుబ్బారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పొగాకు ఉత్పత్తుల వల్ల కలిగే అనర్థాల అనే అంశంపై వ్యాస రచన పోటీలు స్థానిక నైస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పొగాకు ఉత్పత్తుల వల్ల కలిగే అనర్థాల గురించి తెలిపే కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో క్లబ్ క్యాబినెట్ సెక్రటరి రాయపాటి శ్రీనివాస్, అధ్యక్షురాలు రాయపాటి నాగలక్ష్మి, సభ్యులు పాల్గొన్నారు.

ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి

కర్నూలు(సెంట్రల్): కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భాస్కర్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలోని అన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో విద్యాసంవత్సరం ప్రారంభం కాక మునుపే నో అడ్మిషన్ బోర్డులు పెట్టడం అన్యాయమన్నారు. టెక్నో, ఈటెక్నో, ఒలింపియాడ్, మెడికల్, ఇంజినీరింగ్, సీఓ కోర్సుల పేరుతో అక్రమంగా ఫీజుల దోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంగడిలో సరుకుల్లాగా పాఠశాలల్లోనే పాఠ్యపుస్తకాలు, దుస్తులను అమ్ముతూ వ్యాపారం చేస్తున్నా విద్యాశాఖాధికారులు పట్టించుకోవడంలేదన్నారు. ఫీజుల నియంత్రణ చట్టం అమలు కోసంజూన్ 7వ తేదీన రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ, నగర అధ్యక్షుడు దామోదర్, ఏఐఎస్‌ఎఫ్ నగర కోశాధికారి అశోక్, నగర నాయకులు నవనీత్, వర్ధన్, నాని పాల్గొన్నారు.

యువత చారిత్రక విషయాలు తెలుసుకోవాలి

కర్నూలు కల్చరల్: యువత చారిత్రక విషయాలు తెలుసుకొని వాస్తవాలను గ్రహించాలని విశ్వ హిందూ పరిషత్ కేంద్రీయ సంయుక్త ప్రధాన కార్యదర్శి స్థాను మాలయన్ అన్నారు. స్థానిక ఇండస్ పాఠశాలలో జరుగుతున్న బజరంగ్ దల్ శిక్షణ తరగతులకు హాజరైన ఆయన మాట్లాడుతూ మన సంస్కృతిని, పరాక్రమ వీరుల చరిత్రను మన పాఠ్యపుస్తకాల్లో వక్రీకరించి రాశారని ఆరోపించారు. అసలైన భారత పరాక్రమ చరిత్రను నేటి యువత పుస్తకాల పఠనం ద్వారా తెలుసుకొని నాటి తప్పిదాలు పునరావృతం కాకుండా దేశ, ధర్మ రక్షణలో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బజరంగ్ దల్ రాష్ట్ర కన్వీనర్ తూముకుంట ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర కో కన్వీనర్ సందీప్, రాష్ట్ర నాయకులు రవికుమార్, కమ్మయ్య, పెంచల్ రెడ్డి, శశికుమార్, పిచ్చయ్య చౌదరి, నీలి నరసింహ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

యోగా క్రీడాభివృద్ధికి కృషి

కర్నూలు (టౌన్): యోగా క్రీడాభివృద్ధికి స్పోర్ట్స్ అథారిటీ కృషి చేస్తోందని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు అన్నారు. శుక్రవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో వేసవి శిక్షణ శిబిరాల శిక్షకులకు క్రీడా పరికరాలు అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్‌డీఓ మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొనే క్రీడాకారుల ప్రతిభను ప్రతి శిక్షకుడు వెలికి తీయాలన్నారు. రాష్ట్రంలోనే వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్న ఏకైక జిల్లాగా కర్నూలు జిల్లా నిలిచిందన్నారు. శిక్షకులు అంకితభావంతో యోగా చేయించి ఆరోగ్యవంతమైన క్రీడాకారులుగా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు.

గ్రౌండ్స్‌మెన్ భీముడుకు ఘన సత్కారం...

స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో గ్రౌండ్స్‌మెన్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన భీముడుకు ఘనంగా సత్కారం చేశారు. శుక్రవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అతిథిగా జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు పాల్గొని మాట్లాడారు.

హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శివశంకర్‌రావుకు సన్మానం



హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శివశంకర్‌రావును సన్మానిస్తున్న అధికారులు, ఉద్యోగులు

కర్నూలు(హాస్పిటల్): జిల్లా ఎయిడ్స్ అండ్ లెప్రసి కార్యాలయంలో హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌గా పని చేస్తూ శుక్రవారం పదవీ విరమణ చెందిన ఎస్. శివశంకర్‌రావు, డీపీఎం ఓసీ. చంద్రయ్యశెట్టి పదవీ విరమణ చేశారు. వీరిని శుక్రవారం స్థానిక సి.క్యాంపులోని డ్రైవర్స్ అసోసియేషన్ ఫంక్షన్ హాలులో ఘనంగా సన్మానించారు. ఉద్యోగ నిర్వహణలో ఆయన చేసిన సేవలను జిల్లా ఎయిడ్స్ అండ్ లెప్రసి అధికారి డాక్టర్ ఎల్. భాస్కర్‌తో పాటు ఉద్యోగులు కొనియాడారు.

మార్చురి సహాయకుడు లక్ష్మన్నకు సన్మానం

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని మార్చురిలో 30 ఏళ్లుగా సహాయకునిగా సేవలందించిన లక్ష్మన్నను శుక్రవారం ఫోరెన్సిక్ మెడిసిన్ హెచ్‌ఓడీ డాక్టర్ సాయిసుధీర్ ఆధ్వర్యంలో వైద్యులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు.

పెద్దాసుపత్రి అభివృద్ధికి విశేష కృషి

- సూపరింటెండెంట్ వి. వెంకటరంగారెడ్డి సన్మాన కార్యక్రమంలో వక్తలు



కేఎంసీలో డాక్టర్ వెంకటరంగారెడ్డి దంపతులను సన్మానిస్తున్న అధికారులు, వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని అన్ని విభాగాల అభివృద్ధికి డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి విశేష కృషి చేశారని వక్తలు కొనియాడారు. శుక్రవారం ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి పదవీ విరమణ చెందారు. ఆయనతో పాటు పాథాలజి హెచ్‌ఓడీ డాక్టర్ టి. ధనుంజయరావు, జనరల్ మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ షేక్ సైఫుల్లా షరీఫ్, ఎస్‌పీఎం విభాగం డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ వై. బాలకోటయ్య పదవీ విరమణ చెందారు. వీరికి కర్నూలు మెడికల్ కాలేజీలోని న్యూ క్లినికల్ లెక్చర్ గ్యాలరీలో ప్రభుత్వ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ డాక్టర్ వెంకటరంగారెడ్డి ఆసుపత్రిలోని ఆయా విభాగాధిపతులను పిలిపించుకుని విభాగానికి ఏమేమి కావాలో ఇండెంట్ పెట్టించుకుని అడిగి మరీ తెప్పించి ఇచ్చారన్నారు. ఆయన పనిచేసిన 10 నెలల కాలంలోనే దాదాపుగా అన్ని విభాగాలకు విలువైన వైద్యపరికరాలు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నరసమ్మ, కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి. వెంకటేశ్వర్లు, ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.హరిచరణ్, డాక్టర్ పద్మవిజయశ్రీ, డాక్టర్ రేణుక, డాక్టర్ సాయిసుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన వల్లూరి క్రాంతి

డాక్టర్ వెంకటరంగారెడ్డి సన్మాన కార్యక్రమంలో ఆయన కూతురు, తెలంగాణా రాష్ట్రంలోని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆమె తన తండ్రి గురించి మాట్లాడుతూ తాను జిల్లా కలెక్టర్ స్థాయిలో ఉండటానికి కారణం నాన్నే అని తెలిపారు. పాఠశాల, కళాశాల నుంచి వచ్చిన తనకు నాన్న మళ్లీ చదువు చెప్పేవారని, పరీక్షలు కూడా ఇంట్లో పెట్టేవారని గుర్తు చేశారు. ఇందుకోసం ఆయన మా పుస్తకాలు ఎంతో కష్టపడి చదివేవారని చెప్పారు. ఆయనకు ఐఏఎస్ కావాలని ఎంతో ఇష్టముండేదని, దురదృష్టవశాత్తు కాలేకపోయారని, ఆయన కలను మాలో చూసుకున్నారని గుర్తు చేశారు.

పెద్దాసుపత్రిలో...

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ధన్వంతరి హాలులో శుక్రవారం సాయంత్రం ఆసుపత్రి పరిపాలన విభాగం ఉద్యోగులు డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి దంపతులకు సత్కరించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి అభివృద్ధికి చేసిన కృషిని సీఎస్‌ఆర్‌ఎంఓ డాక్టర్ బి. వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్‌ఆర్‌ఎంవో డాక్టర్ హేమనళిని, ఆర్‌ఎంఓ డాక్టర్ వెంకటరమణ, ఏడీలు రమేష్‌బాబు, అనిల్‌కుమార్, ఆఫీస్ సూపరింటెండెంట్ కుమారస్వామి, ఉద్యోగులు కొనియాడారు.

మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో...

ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో డాక్టర్ వి. వెంకటరంగారెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు బాలు నాయక్, సెక్రటరి ఖాజామొద్దీన్, ట్రెజరర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎప్పటికప్పుడు మీడియాకు ఫలితాల వివరాలు

- కమ్యూనికేషన్, మీడియా సెంటర్ల ద్వారా అందజేతకు చర్యలు
- లైబ్రరీ గ్రౌండ్ ఫ్లోర్‌లో కౌంటింగ్ రిజర్వ్‌డ్ సిబ్బంది వేచి ఉండేలా ఏర్పాట్లు
- కౌంటింగ్ హాళ్లు, స్ట్రాంగ్ రూమ్‌లు పరిశీలించిన కలెక్టర్,ఎస్పీ



మీడియా సెంటర్‌లో ఏర్పాట్లపై ఆరా తీస్తున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన, ఎస్పీ జి.కృష్ణకాంత్ తదితరులు

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల ఫలితాలను కమ్యూనికేషన్, మీడియా సెంటర్ల ద్వారా మీడియాకు త్వరితగతిన అందించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి/కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులకు సూచించారు. శుక్రవారం రాయలసీమ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన మీడియా, కమ్యూనికేషన్ సెంటర్లలో ఏర్పాట్లను ఆమె ఎస్పీ జి.కృష్ణకాంత్‌తో కలిసి పరిశీలించారు.అనంతరం కంట్రోల్ రూంలో స్ట్రాంగ్ రూమ్ లైవ్ ఫీడ్‌ను పరిశీలించి ఈవీఎంలను భద్రపరచిన ఇంజినీరింగ్ బ్లాక్‌ను, కౌంటింగ్ హాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ప్రతి నియోజకవర్గానికి ఒక్క డీపీఆర్‌ఓను నియమించి రౌండ్ల వారీ ఫలితాలను మీడియా సెంటర్‌లో డిస్‌ప్లే చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాగా, కౌంటింగ్ హాళ్ల విజువల్స్ తీసుకోవడానికి 5 నుంచి 6 మందిని వాహనంలో తీసుకెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. మీడియా ప్రతినిధులకు మీడియా సెంటర్ వరకు మాత్రమే మొబైల్ ఫోన్ల అనుమతి ఉందని, కౌంటింగ్ హాళ్లలోకి అనుమతి ఉండదన్నారు. మీడియా సెంటర్‌లో కంప్యూటర్, ప్రింటర్, స్కానర్‌తోపాటు ఇంటర్నెట్ సదుపాయం కల్పించాలన్నారు. కమ్యూనికేషన్ సెంటర్‌లోనే మీడియాకు సమాచారం ఇచ్చే సిబ్బంది ఉండి రౌండ్ల వారీగా ఫలితాలను ప్రింట్ తీసుకొని మీడియా సెంటర్‌కు తీసుకెళ్లాలన్నారు. ప్రతి బ్లాక్‌లో ఏర్పాటు చేసిన అబ్జర్వర్ల రూమ్‌ల వివరాలను సంబంధిత అబ్జర్వర్ల లైజన్ అధికారులకు తెలియజేయాలన్నారు. కౌంటింగ్ రిజర్వ్‌డ్ సిబ్బందిని లైబ్రరీ బ్లాక్‌లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో వేచి ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో కె.మధుసూదన్‌రావు, ఇరిగేషన్ ఎస్‌ఈ రెడ్డి శేఖర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ నాగరాజు, కూడా వైస్ చైర్మన్, వెబ్ కాస్టింగ్ నోడల్ అధికారి ప్రతాపరెడ్డి, ఐఅండ్‌పీఆర్ డీడీ జయమ్మ, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ వెంకట లక్ష్మమ్మ పాల్గొన్నారు.

ఆటోల దొంగతనాలను నియంత్రించాలి

కర్నూలు(సెంట్రల్): నగరంలో వరుసగా ఆటోల దొంగతనాలు జరుగుతున్నాయని, నియంత్రించడానికి పోలీసులు చర్యలు తీసుకోవాలని ఏపీ ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. మూడు నెలల క్రితం ఓ కార్మిక సంఘం నాయకుడి ఆటో దొంగతానికి గురైనా ఇంత వరకు ఆచూకీ కనుగొనలేదన్నారు. శుక్రవారం వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన షేక్. మహబూబ్ ఆటోను ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు తీసుకెళ్లారన్నారు. పోలీసులు ఈ చోరీపై దృష్టి సారించాలన్నారు.

2న కీళ్ల జబ్బులపై అవగాహన సదస్సు

కర్నూలు(హాస్పిటల్): కీళ్ల జబ్బుల గురించి జూన్ 2వ తేదీన అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కర్నూలు హార్ట్ ఫౌండేషన్ సెక్రటరి డాక్టర్ పి. చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2వ తేది సాయంత్రం 6 గంటలకు స్థానిక ఎ.క్యాంపులోని కర్నూలు హెల్త్ క్లబ్‌లో సదస్సు ప్రారంభమవుతుందని, సదస్సులో కీళ్లవ్యాధుల నిపుణులు డాక్టర్ జి. శ్రీహరిరెడ్డి పాల్గొని ప్రసంగిస్తారన్నారు.

పదవీ విరమణ చేసిన గెజిటెడ్ మేనేజర్‌కు సత్కారం



పదవీ విరమణ చేసిన రామస్వామిని సత్కరిస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో 2017 మే నెల నుంచి గెజిటెడ్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న రామస్వామి శుక్రవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని ఫ్రెమ్‌ల్యాండ్ హోటల్ సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన సత్కారం కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంటు సర్జన్‌లు, అసిస్టెంటు డైరెక్టర్లు, డీడీలు, పార సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్ రామస్వామి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ డీడీలు, ఏడీలు, పశువైద్యులతో పాటు ఉమ్మడి జిల్లా ఎన్‌జీఓ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీసీహెచ్ వెంగళరెడ్డి, జవహర్‌లాల్, నగర శాఖ అధ్యక్షుడు ఎంసీ కాశన్న తదితరులు పాల్గొన్నారు.